క్లుప్తంగా

శస్త్రచికిత్సలకు 61 మంది ఎంపిక

రోలుగుంట: పర్సన్ ఇన్‌చార్జి మడ్డు తాతబాబు ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం స్థానిక పీఏసీఎస్ ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 161 మంది రోగులను ఆప్తాలమిస్ట్ వరహాలు పరీక్షించారు. వీరిలో 61 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని బుధవారం ప్రత్యేక వాహనంలో విశాఖలో తమ ఆస్పత్రికి తరలిస్తామని ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. స్టాఫ్‌నర్సు శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండలో చదవడం మాకిష్టం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గొలుగొండ: చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు రాజుబాబు మాట్లాడుతూ పాఠశాల సెలవు రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు విద్యపై ఆసక్తి, గ్రంథాలయాల గొప్పతనం వివరిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు.

నేడు బాల వినాయకుడికి లక్ష బిల్వార్చన

మాడుగుల: నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మూడు రోడ్ల కూడలి వద్ద బాల వినాయకుడికి సోమవారం ఉదయం లక్ష బిల్వార్చన చేయనున్నట్టు బాల వినాయక సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఇక్కడ 68 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆలయానికి ఇన్వర్టర్ బహూకరణ



దాతలు అందించిన ఇన్వర్టర్

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదకొండమ్మ ఆలయానికి దాతలు సహకారంతో ఇన్వటర్‌ను బహూకరించారని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన కాళ్ల సూర్యనారాయణ కుమారులు అప్పలనాయుడు, చిన అప్పలనాయుడు, అచ్చిమినాయుడులతోపాటు దాడి రాము (మెడికల్ షాపు), మళ్ల కన్నబాబు ఆర్థిక సాయంతో దీన్ని సమకూర్చారన్నారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నేడు

మాడుగుల: జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో స్థానిక పాల కేంద్రం వద్ద సోమవారం ఉదయం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యుడు గౌరీపట్టపు మహేష్ కుమార్ తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు రోగులను పరీక్షిస్తారన్నారు. కంటి బాధితులు తమ ఆరోగ్యశ్రీతోపాటు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని కోరారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులతో పీడీ లక్ష్మి

కె.కోటపాడు: జిల్లా స్థాయి క్రీడా పోటీలకు స్థానిక హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 22, 23 తేదీల్లో చీడికాడలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో అండర్-14 అథ్లెటిక్స్‌లో ప్రవీణ్, అండర్-14 కబడ్డీలో సాగర్, అండర్-14 ఖో-ఖో విభాగంలో జె.హారిక, అండర్-17 టెన్నీకాయిట్ విభాగంలో జి.అనిత, పి.భువనేశ్వరి ప్రతిభ చూపి ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం పద్మావతి, పీడీ ఆర్.లక్ష్మి అభినందించారు.



జీటీ రోడ్డుగా మారనున్న కామకూటం గ్రామ గ్రావెల్ రోడ్డు



గొట్టాల వంతెన దగ్గర శిథిలమైన రహదారి (ఫైల్)

గిరి రోడ్డుకు మోక్షం



అభివృద్ధి బాగుందని చెబుతున్న కామకూటం గ్రామస్తులు

- జీటీరోడ్డు నిర్మాణానికి రూ.3.10 కోట్లు మంజూరు
- వర్షాలు తగ్గిన తర్వాత పనులు ప్రారంభం
- ఇటీవల 10 మీటర్ల మేర బురదగా మారిన గ్రావెల్ రోడ్డు
- ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం

మాడుగుల: గిరిజన గ్రామాల్లో కొండబాటల రూపురేఖలు మారుతున్నాయి. గతంలో కనీసం ద్విచక్ర వాహనం వెళ్లలేని పరిస్థితి ఉండేది. రాళ్లూరప్పలతో పాటు ముళ్లపొదలు కప్పేస్తుండేవి. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా నేడు గ్రావెల్, తారు రోడ్లుగా రూపాంతరం చెందుతున్నాయి. ఇంకా కొన్నిచోట్ల రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఇటీవల వర్షాల కారణంగా వాటి పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. వర్షాలు తగ్గిన వెంటనే ఈ పనులు ప్రారంభం కానున్నాయి. ఇవేమీ తెలుసుకోకుండా ఎల్లో మీడియా తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడంతోపాటు పచ్చనాయకులు విమర్శలు చేయడంపై గిరిజన లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

ఇప్పటికే గ్రావెల్ రోడ్డు నిర్మాణం

ఏళ్ల పాటు కొండవీధితోపాటు కామకూట గ్రామాలకు కొండబాటలే ఉండేవి. నాలుగేళ్ల క్రితం ప్రస్తుత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కొండగెడ్డపై గొట్టాలు వంతెన తాత్కాలికంగా ఏర్పాటు చేసి కొండబాటలను మట్టి రోడ్డుగా అభివృద్ధి చేశారు. తాజాగా రెండున్నర కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇటీవల వర్షాలకు గొట్టాలు మదుం కోతకు గురవడంతోపాటు పది మీటర్ల మేర రోడ్డు బురదమయంగా మారింది.

రెండు గిరి గ్రామాలకు రూ.3.10 కోట్లు

మండలంలో జాలంపల్లి పంచాయతీ శివారు ఎల్.కృష్ణాపురం నుంచి కొండవీధి మీదుగా కామకూటం వరకు 2.6 కిలోమీటర్ల మేర పక్కా రహదారి నిర్మాణానికి మార్చిలో ఏఐఐబీ నుంచి రూ.3.10 కోట్లు మంజూరయ్యాయి. టెండరు కూడా ఖరారైంది. ఏడాదిన్నరలోగా ఈ రోడ్డు నిర్మించాలని ఒప్పందం కుదిరింది. వర్షాలు కారణంగా కాంట్రాక్టరు పనులు ప్రారంభించలేదు. దాంతో కొంతమంది పచ్చనాయకులతోపాటు ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేస్తుండటంతో గిరిజనులు ఆగ్రహిస్తున్నారు.

75 ఏళ్ల తర్వాత రోడ్డు నిర్మాణం



ఇంత వరకు మా గ్రామాన్ని పట్టించుకునే నాథుడే లేడు. గతంలో ఎనిమిది కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి జాలంపల్లిలో రేషన్ సరుకులు తీసుకునేవారం. ఇప్పుడు మా దగ్గరలోకి వస్తున్నాయి. 75 ఏళ్ల తర్వాత మా గ్రామానికి గ్రావెల్‌రోడ్డు వేశారు. ఈ నేపథ్యంలో కొండగెడ్డ వద్ద కోతకు గురవడంతో వాహనం రాకపోవడంతో పది మీటర్ల దూరం వరకు రెండు రోజుల క్రితం గర్భిణిని డోలీపై మోసికెళ్లి అక్కడ ఆటో ఎక్కించాం. దీనిపై కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తూ మా గ్రామాభివృద్ధిని అడ్డుకోవడం తగదు.

– బూరుగు వరలక్ష్మి, గిరి మహిళ, కొండవీధి

మా కష్టాలు తొలగాయి



మా పూర్వీకుల నుంచి రహదారి కలగానే మిగిలిపోయింది. రాత్రయితే గ్రామం దాటలేని పరిస్థితులు ఉండేవి. ఈ నేపథ్యంలో రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచిన బూడి ముత్యాల నాయుడు కృషితో గ్రావెల్ రోడ్డు ఏర్పాటైంది. ప్రస్తుతం డిప్యూటీ సీఎం హోదాలో పక్కా రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. పదడుగుల రోడ్డు బురదగా ఉంది. దీన్ని బూచిగా చూపించి మొత్తం రోడ్డంతా బాగోలేదని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉంది.

– కొర్రా అప్పలనాయుడు, గిరిజనుడు కామకూటం గ్రామం

దుష్ప్రచారం తగదు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కృషి ఫలితంగా మా మండలంలో గిరిజన గ్రామాలకు మహర్దశ పట్టింది. కొన్ని రోడ్లు ప్రారంభించాల్సి ఉంది. కొండవీధికి, కామకూట గ్రామాలకు ఇప్పటికే గ్రావెల్ రోడ్లు పూర్తి చేశారు. పక్కా రోడ్డు నిర్మాణానికి టెండరు ఖరారైంది. వర్షాలు తగ్గాక పనులు చేస్తారు. ఇది తెలుసుకోకుండా గిరిజన గ్రామాలకు డోలి మోతలు తప్పలేదని కొంత మంది దుష్ప్రచారం చేయడం తగదు. గిరి గ్రామాలు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందుతున్నాయి.

– కిముదు రమణమ్మ, జెడ్పీటీసీ, మాడుగుల

అభివృద్ధి కనిపించలేదా?



మా పంచాయతీలో శివారు గ్రామాలైన రాచ గొప్పూరు, సిరిపురంలో 120 మంది జనాభా ఉంది. వీటి అభివృద్ధికి రూ.5.60 కోట్లు మంజూరయ్యాయి. 300 జనాభా ఉన్న కామకూటం, కొండవీధి గ్రామాలకు రూ.3.10 కోట్లతో పక్కా రోడ్డు నిర్మించనున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయాలేదు. ఇకనైనా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలి.

– దారా మల్లేశ్వరిచిన్ని, సర్పంచ్, జాలంపల్లి

మృతుల కుటుంబాలకు చందాలు



కె.జె.పురం కైలాస వాటికలో చందాలు సేకరిస్తున్న అమ్మతల్లినాయుడు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో పేద కుటుంబాల వారు చనిపోతే, ఆర్థిక సాయం అందించడానికి చందాల పుస్తకం ఏర్పాటు చేశామని స్థానిక సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు తెలిపారు. చందాలు వసూలు చేసి మృతి చెందిన కుటుంబానికి అందిస్తామన్నారు. ఆ నగదు వద్దనుకుంటే కైలాసవాటిక అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. ఆదివారం ఇక్కడ కాళ్ల అప్పారావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన కుటుంబానికి చందాలు రూపంలో వచ్చిన నగదు అందజేశారు. మృతదేహం వెంట అరటి గెలలు ఎక్కువగా శ్మశానవాటికకు తీసుకురావద్దని సూచించారు. ఇవి వృథాగా పడివుంటున్నాయన్నారు. అమ్మతల్లినాయుడు నిర్ణయాన్ని గ్రామస్తులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల సందడి



మాడుగుల ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాడుగుల రూరల్: ఎప్పుడో 38 సంవత్సరాల క్రితం చదువుకున్న వారికి స్థానిక ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం వద్ద టేకు తోట వేదిక అయింది. వీరంతా ఆదివారం కలుసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. 1984-85 విద్యా సంవత్సరంలో మాడుగుల ప్రభుత్వ హైస్కూలులో పదో తరగతి చదువుకున్న 50 మంది విద్యార్థులు సమావేశమయ్యారు. అప్పట్లో తాము చదువుకున్న పాత జ్ఞాపకాలను ఈ సందర్భంగా నెమరు వేసుకున్నారు. వారు చేస్తున్న వృత్తి, వ్యాపార, ఉద్యోగాలు, కుటుంబ వ్యవహారాలు గురించి మనస్సు విప్పి ఒకరికొకరు పంచుకున్నారు. సుదూర ప్రాంతాల్లో వ్యాపార, ఉద్యోగాలల్లో వీరంతా పనిచేస్తున్నారు. వీరిలో బాబా చక్రవర్తి అంబేడ్కర్, అమెరికాలో హరిస్బర్గ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, డీఆర్‌డీఏ శాస్త్రవేత్తగా గరిమెళ్ల కృష్ణ మరో పూర్వ విద్యార్థి ఉన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్‌గా, ఉపన్యాసకులుగా పనిచేస్తున్న వారిని తోటి విద్యార్థులు అభినందించారు. వేర్వేరు కారణాల వల్ల చనిపోయిన 16 మంది సహచర విద్యార్థులకు సంతాపం తెలియజేశారు. తమలో ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడానికి తీర్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఉపాధ్యాయులను సత్కరించి సామగ్రి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చీడికాడ: తురువోలు ఉన్నత పాఠశాలలో చదువుకుని వివిధ స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారంగా ప్రింటర్, పబ్లిక్ అనౌన్స స్పీకర్‌ను బహూకరించారు. ఇక్కడ 2004-05లో పదో తరగతి చదివిన విద్యార్థులు వీటిని అందించినట్లు హెచ్‌ఎం రామకృష్ణ తెలిపారు. అనంతరం పాఠశాలలో మొక్కలను నాటారు. హెచ్‌ఎంతోపాటు సిబ్బందిని దశ్శాలువాలతో సత్కరించారు. పాఠశాలకు ఏ అవసరమున్నా తమ వంతు సహకారం అందిస్తామని విద్యార్థులు జి.పి.ఏ నాయుడు, తదితరులు తెలిపారు. తొలుత పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సందడిగా జరిగింది.

ఎన్. గజపతినగరంలో ఘనంగా పశువుల పండగ



ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

దేవరాపల్లి: ఎన్. గజపతినగరంలో పశువుల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాదిరిగా పాడి, పంటలు వృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ సంప్రదాయ బద్ధంగా పసలమారమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామస్తులంతా పసుపు కుంకుమలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలతోపాటు వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధమా?

- కనీసం ఏనాడైనా రోడ్డు వేశావా?
- టీడీపీ నేత రామానాయుడుకు వైఎస్సార్‌సీపీ నేతల సవాల్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చీడికాడ: నీరు-చెట్టు పేరిట దోచుకున్న టి.డి.పి నేత, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం సవాల్ విసిరారు. ఆదివారం అప్పలరాజుపురంలో సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు ఇంటి వద్ద వారు మాట్లాడారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా మరో ఐదేళ్లు అధికార పార్టీలో ఉన్నప్పుడు మండలంలోని ఒక రోడ్డయినా వేశావా అని ప్రశ్నించారు. వైఎస్ హయాంలోనూ మరలా నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నూతన రోడ్లు నిర్మించారన్నారు. సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ మన గ్రామంలో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. సొంత కుటుంబమైన గవిరెడ్డి వారి పాకలకే కనీసం గ్రావెల్ రోడ్డు వేయని పాపానపోలేదన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో గ్రంథాలయం, ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో మినీ కల్యాణ మండపం, సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్, మూడు దేవాలయాల నిర్మాణం, డ్రైనేజీలు, సీసీరోడ్లతోపాటు జలజీవన్ మిషన్‌లో రూ.1.50 కోట్లతో దేవిమెట్టపై 90 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మించి దేవినగర్‌తోపాటు గ్రామం మొత్తం ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసిన ఘనత డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుకే దక్కిందన్నారు. నాలుగున్నరేళ్లలో మండలంలోని రూ.24 కోట్లతో 17 ప్రధాన రోడ్లతోపాటు మెటల్, మట్టిరోడ్లు తారురోడ్లగా మారాయన్నారు. మండల యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, నాయకులు నేతలు సుంకర శ్రీనువాసరావు, లాలం జానకీరాం, కురచా నారాయణమూర్తి, నందారపు రమణబాబు, పరువాడ మహేష్, శరగడం సన్యాసినాయుడు, ఈర్లె చైతన్య, గెంజి బాలాజీ, షేకు సూర్యనారాయణ, కొండబాబు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాతవరం: ఉప్పరగూడెంలో ఆదివారం కాకినాడకు చెందిక అంజు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 119 మంది రోగులను వైద్యుడు తేజ పరీక్షించారు. వారిలో 38 మందిని ఉచిత కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కొంతమందికి కళ్లద్దాలు అవసరమన్నారు. వీటిని ఉచితంగా అందిస్తామన్నారు. మిగిలిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ సహకారం అందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



ధనుంజయ్‌ను సత్కరిస్తున్న గ్రామపెద్దలు

నాతవరం: చమ్మచింత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వేంపాటి ధనుంజయ్‌ను గ్రామ పెద్దలు, అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రామంలో అధిక శాతం విద్యార్థులు ఏపీఆర్జేసీ, పాలిటెక్నికల్‌కు ఎంపిక కావడానికి ధనుంజయ్ విశేష కృషి చేస్తున్నారు. సొంత ఖర్చులతో ఆన్‌లైన్లో దరఖాస్తు చేయడమే కాకుండా పేద విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు చెల్లిస్తున్నారు. విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని యువకులను చైతన్య పరుస్తున్నారు. దీనికి గాను ఇటీవల ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో గౌరవించింది.

దేవరాపల్లిలో భారీ వర్షం



దేవరాపల్లిలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

దేవరాపల్లి: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఏకధాటిగా అరగంట పాటు కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడింది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంత పొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. ఈ వర్షం ఖరీఫ్ పంటలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వెరసి 2.5 సెంటీమీటర్ల మేర వర్షం పాతం నమోదైంది.

27న దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం

చోడవరం రూరల్: ఈ నెల 27న విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరాన్ని చోడవరంలో నిర్వహించనున్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని చోడవరం, బుచ్చియ్యపేట, రావికమతం, రోలుగుంట, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు చెందిన కనీసం 40 శాతం వైకల్యం కలిగిన విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు ఈ శిబిరానికి హాజరు కావచ్చు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరంలో మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, ఎ.డి.ఎల్ కిట్లు, సి.పి.చైర్స్, బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు వంటి ఉపకరణాలను అందించడానికి అర్హులను ఎంపిక చేస్తారు. ఆలిమ్‌కో సంస్థ సహకారంతో వీరందరికీ ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారు. అనకాపల్లి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న శిబిరానికి హాజరయ్యేవారు తగిన ధ్రువపత్రాలను తీసుకురావాల్సి ఉంటుంది. మూడేళ్ల లోపు ఉపకరణాలు పొందిన వారు అనర్హులు.

క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నర్సింగరావు

దేవరాపల్లి: నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో తెనుగుపూడి డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. చీడికాడలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, టెన్నికాయిట్‌లో బాలుర జట్టు విజేతగా నిలిచింది. అండర్-17 విభాగం అథ్లెటిక్స్‌లో సిహెచ్. సూర్యకిశోర్ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాడు. సిహెచ్. ఈశ్వర్ 200 మీటర్లు, 400 మీటర్లు రన్నింగ్‌లో ప్రథమ, ద్వితీయ, కె. శశాంక్ 800 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, ఎల్. సాయికిరణ్ 1500 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్-14 బాలుర విభాగంలో గౌరీ మణిశంకర్ షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, 600 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానంలో నిలిచాడు. ఐ. మహేష్ లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, ఆర్. తరుణ్ 400 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరితోపాటు పీఈటీలు జి. తరుణేశ్వరరావు, ఎస్. నాగేశ్వరరావులను గురుకుల ప్రిన్సిపాల్ కె.వి.ఎల్.ఎన్. నర్సింగరావు, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

చంద్రబాబును శిక్షించాలంటూ వినూత్న నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నర్సీపట్నం: స్కిల్ స్కాంలో ప్రధాన సూత్రధారి చంద్రబాబును కఠినంగా శిక్షించాలంటూ.. వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం టౌన్ నాయకులు ఆదివారం నిరసన చేపట్టారు. చంద్రబాబు జైలుకెళ్లిన సందర్భాన్ని పురస్కరించుకుని కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరి కాయలు కొట్టి వినూత్న నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా ధనాన్ని కాజేసిన చంద్రబాబును కఠినంగా శిక్షించాలన్నారు. స్కిల్ స్కాంపై ఈడీతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుపై ఉన్న కేసులపై స్టే ఎత్తివేసి విచారణ కొనసాగించాలన్నారు. స్కిల్ స్కాంలో మరో సూత్రధారి నారా లోకేషను తక్షణమే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, కర్రి శ్రీనివాసరావు, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, కర్రి రాంగోపాల్, పార్టీ నాయకులు గంటా లలిత, కొణతాల వరలక్ష్మి, దేవత అరుణ, ఆరుగుల్ల రాజుబాబు, యూత్ నాయకులు ధనిమిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

హిందువుల ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలి



మాట్లాడుతున్న ఆర్.ఎస్.ఎస్. రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి యుగంధర్

ఆర్.ఎస్.ఎస్. రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి యుగంధర్



హాజరైన ఆర్.ఎస్.ఎస్ సభ్యులు, ప్రజాప్రతినిధులు

మాడుగుల రూరల్: హిందువుల ఖ్యాతిని ప్రపంచంలో చాటి చెప్పాలని ఆర్.ఎస్.ఎస్. రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి కె. యుగంధర్ తెలిపారు. మాడుగుల మండల ఖండ సంఘ పరిచయ సమావేశం ఆదివారం సాయంత్రం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ఆర్.ఎస్.ఎస్ 98 సంవత్సరాలుగా హిందువులును సంఘటితం చెయ్యడంతో పాటు, వీరిలో చైతన్యం నింపి, మనమంతా హిందువులం అనే భావన కలిగిస్తుందన్నారు. ప్రపంచంలో భారతదేశానికి సనాతన కాలం నుంచి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. సిరిసంపదలతో తూలతూగే భారత దేశం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుందన్నారు. వాటిని ఎదుర్కోవటంలో రాష్ట్రీయ స్వయం సహాయ సంఘ్ ప్రధాన భూమిక వహిస్తుందన్నారు. ఇతర దేశాలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన దేశం అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని, ఇది మరువలేనిదన్నారు. వాలంకి శ్రీనివాస్, గత్రెడి జగదీశ్, మాడుగుల, చీడికాడ, మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఆర్.ఎస్.ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.